క్లుప్తంగా

30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

మైలవరం: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్)ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి అనుగ్రహ ప్రసాద్ డిమాండ్ చేశారు. మైలవరంలో మండల ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్‌సీ ప్రకటన ఇప్పటికే ఆలస్యమైనందున తక్షణమే ఐఆర్ ప్రకటించి 12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించి వెంటనే నివేదికను తెప్పించుని వీలైనంత త్వరలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ మైలవరం మండల ప్రధాన కార్యదర్శి పి. రవిబాబు మాట్లాడారు. జిల్లా నాయకులు కె. ప్రభు, కె. సజ్జనరావు, సీహెచ్ సుంకిరెడ్డి, ఎస్‌కే జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

విష సర్పాల సంచారంతో భయాందోళన

తిరువూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నివాస గృహాల మధ్య ఏర్పడిన తటాకాల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయని తిరువూరు నగర పంచాయతీలోని 9వ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రెండు విష సర్పాలు నిల్వ ఉన్న వర్షం నీటిలో కనిపించడంతో భయాందోళనలతో పరుగులు తీశారు. నిత్యం విద్యార్థులు, చిన్నపిల్లలు ఈ ప్రాంతంలో సంచరిస్తూ, ఆటలాడుకుంటారు. విష సర్పాలు కనిపించడంతో తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వర్షం నీటి తొలగింపునకు చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ దుర్గారావు మోటారుతో నీటిని తొలగించారు.

శాంతి, సామరస్యాలతోనే అభివృద్ధి

తిరువూరు: ప్రపంచ దేశాలు యుద్ధాలకు, కవ్వింపు చర్యలకు పాల్పడకుండా శాంతి సామరస్యాలతో మెలిగితేనే అభివృద్ధి సాధ్యపడుతుందని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు అన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవం శనివారం కళాశాలలో నిర్వహించారు. ఇటీవల జరుగుతున్న యుద్ధాలతో అన్ని దేశాలూ తీవ్రంగా నష్టపోతున్నాయని, యుద్ధాలు జరిగే దేశాలు ప్రత్యక్షంగా నష్టపోతుండగా, పరోక్షంగా ప్రపంచ దేశాలన్నిటిపై దీని ప్రభావం పడుతోందని ప్రిన్సిపాల్ అన్నారు. బుద్ధుడి బోధనలు శాంతి సామరస్యాలను ప్రతిబింబిస్తాయని చెప్పారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి, మత పెద్దలు రెవరెండ్ ఫాదర్ సురేష్, అబ్దుల్ హమీద్ మాట్లాడారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం

తిరువూరు: ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకులో శనివారం పలువురు రిటైర్డు ఉద్యోగులను బ్యాంకు అధికారులు సన్మానించారు. తిరువూరు తాలూకా యూనిట్‌లో పనిచేసిన 80 సంవత్సరాలు నిండిన రిటైర్డు ఉద్యోగులు కంచి అంజయ్య, బడుగు రాములు, గుర్రం నాగేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వరరావులను ఎస్‌బీఐ బ్రాంచి మేనేజరు రవికుమార్ సన్మానించారు.

చదలవాడకు ఘన నివాళి

ముసునూరు: అక్కిరెడ్డిగూడెంలో సీపీఐ సీనియర్ నేత చదలవాడ నారాయణరావు సంతాప సభ శనివారం జరిగింది. ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, రాయంకుల లక్ష్మణరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

జి.కొండూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గంగినేని గ్రామంలో గోడకూలి మృతి చెందిన నన్నెబోయిన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు స్థానిక జెడ్పీ హైస్కూల్ సిబ్బంది, పదో తరగతి విద్యార్థులు కలిసి రూ.9,500 శనివారం అందజేశారు. మృతుడి కుమారుడు, కుమార్తె ఇదే పాఠశాలలో చదువుతున్న క్రమంలో వారికి అండగా ఉంటామని ఉపాధ్యాయులు, విద్యార్థులు భరోసానిచ్చారు.

వర్షం నీటిని తొలగించాలని వినతి

ఆగిరిపల్లి: పంచాయతీ రోడ్డుకి అడ్డుకట్ట వేసి వర్షం నీటిని దిగువకు వెళ్లకుండా చేయడం వలన దళితవాడలోని తమ ఇళ్లల్లోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని తోటపల్లికి చెందిన ఇజ్రాయిల్ రాజు శనివారం ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాంకు వినతిపత్రం అందజేశారు. తాము పడుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

విస్సన్నపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేయించాలని, ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నామని బుడగ జంగాల మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ ఎస్. వెంకట రమణ, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, పంచాయతీ ఈఓ హరికృష్ణకుమార్, నాయకులు పాల్గొన్నారు.

పశు పోషకులకు కోలుకోలేని దెబ్బ



జి.కొండూరు బీసీ కాలనీలో వరద ముంపులో చిక్కుకున్న పశువులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న రైతులు (ఫైల్)

- ఇటీవల వరదల్లో కొట్టుకుపోయిన వందలాది జీవాలు
- నియోజకవర్గంలో రూ.2 కోట్ల వరకు పశు పోషకులకు నష్టం
- త్వరితగతిన నష్ట పరిహారం అందించాలని కోరుతున్న బాధితులు
- వంద శాతం అమలు చేస్తేనే బాధితులకు భరోసా

జి.కొండూరు: ఇటీవల వచ్చిన వరదలు పశు పోషకులను కోలుకోలేని దెబ్బతీశాయి. వరద ఉధృతికి తమ ప్రాణాలను కాపాడుకునే క్రమంలో మూగ జీవాలను కోల్పోవాల్సి వచ్చింది. కొందరైతే తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మూగజీవాలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఘటనలు ఉన్నాయి. ఆవులు, గేదెలు, నెలలు కూడా నిండని దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్లు ఇలా అన్ని రకాల జీవాల ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. ప్రభుత్వం మూగ జీవాల ధరను బట్టి వంద శాతం నష్ట పరిహారం అందిస్తే తప్ప పశుపోషణ పునఃప్రారంభించడం సాధ్యంకాదని రైతులు వాపోతున్నారు.

మైలవరం నియోజకవర్గంలో..

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండల పరిధిలో బుడమేరు వరద ప్రభావానికి జంగాలపల్లి, చంద్రాల, దేవుని చెరువు, పొందుగల, మెలవరం, అయ్యప్పనగర్, చంద్రబాబునగర్, తారక రామా నగర్, చిన్న, పెద్ద దళితవాడ, జి.కొండూరు మండల పరిధిలో చిన్ననందిగామ, కుంటముక్కల, కోడూరు, బీమవరప్పాడు, గుర్రాజుపాలెం, వెంకటాపురం, వెల్లటూరు, ఆత్కూరు, ముత్యాలంపాడు, వెలగలేరు, కవులూరు గ్రామాలు, పులివాగు ఉధృతికి ఇదే మండల పరిధిలోని గంగినేని, తెల్లదేవరపాడు, సున్నంపాడు, మునగపాడు, చెర్వుమాధవరం, గడ్డమణుగు, జి.కొండూరు, కొత్తూరు గ్రామాలు, విజయవాడ రూరల్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, షాబాద్, జక్కంపూడి, పైడూరుపాడు, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఈలప్రోలు, కొండపల్లి, గుంటుపల్లి, కృష్ణానది పరివాహక గ్రామాలైన కొటికలపూడి, చిలుకూరు, దాములూరు, మూలపాడు, జూపూడి, కీలేశపురం, ఇబ్రహీంపట్నం, ఫెర్రీ తదితర ప్రాంతాలు వరద ప్రభావానికి గురై మూగజీవాలు ఎక్కువగా మృతి చెందాయి.

రైతులను ఆదుకోవాలి



వరదల్లో మృతిచెందిన మూగ జీవాలకు ధరను బట్టి వంద శాతం నష్ట పరిహారం ప్రభుత్వం అందించాలి. వరదలకు పంటలు కోల్పోయి, పశు గ్రాసం కోల్పోయి రైతులు ఇప్పటికే తీరని నష్టంలో ఉన్నారు. అరకొరగా నష్ట పరిహారం అందిస్తే పశుపోషణను పునఃప్రారంభించడం ప్రశ్నార్థకంగా మారుతుంది. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తి బాధ్యతను తీసుకోవాలి.

– పీవీ అంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రూ.2 కోట్ల వరకు నష్టం

ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ పరిధిలో పశువులు పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి. దీనితో పశుపోషకులు రూ. 2 కోట్ల వరకు నష్టపోయారు. జి.కొండూరు మండల పరిధిలో గేదెలు 6, దూడలు 2, గొర్రెలు 40, మేకలు 35, కోళ్లు 215, మైలవరం మండల పరిధిలో గేదెలు 3, మేకలు 35, కోళ్లు 194, విజయవాడ రూరల్ పరిధిలో ఆవులు 8, గేదెలు 20, మేకలు, గొర్రెలు 9, కోళ్లు 50, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 60 మంది బాధితులకు చెందిన గేదెలు, ఆవులు 175, దూడలు 15, గొర్రెలు, మేకలు 91, కోళ్లు 9,360 మృత్యువాత పడినట్లు అధికారులు అంచనా వేశారు.

వందశాతం నష్ట పరిహారం ఇస్తేనే మేలు

వరద ప్రభావంతో మృత్యువాత పడిన మూగ జీవాలకు నష్ట పరిహారం పశువుల ధరను బట్టి వంద శాతం అందిస్తేనే రైతులు ఈ నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంది. ప్రభుత్వం అందించనున్న పరిహారం ప్రకారం మృతిచెందిన ఆవులు, గేదెలకు ఒక్కొక్క పశువుకు రూ.37,500, మేకలు, గొర్రెలకు రూ.4 వేలు, ఒక్కొక్క కోడికి రూ.100 చొప్పున ఇస్తే రైతులకు యాభై శాతం మాత్రమే అందుతుంది.

సబ్ జైల్‌ను సందర్శించిన జడ్జి

నూజివీడు: పట్టణంలోని సబ్ జైల్‌ను కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎస్. అరుణసారిక శనివారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, సౌకర్యాలు, భోజన నాణ్యతను పరిశీలించారు. జడ్జి మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివపార్వతి, సబ్ జైల్ సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

జి.కొండూరు: సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం గంగినేని జెడ్పీ హైస్కూల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ గొప్పతనం, ఆయన రచనలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీవీ రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని ఎంఈఓ సీహెచ్ పుష్పలత అన్నారు. కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారు జీవితంలోనూ రాణిస్తారన్నారు. అండర్ 14, 17 విభాగంలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. హెచ్‌ఎం పద్మలత, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల వాలీబాల్ జట్టు

ఎ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం ఎస్‌జీఎఫ్ఐ 68వ మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్–14, అండర్–17 విభాగాల్లో 200 మంది బాలికలు పాల్గొన్నారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరిగాయి. ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, ఎంపీటీసీ కోట పుల్లారావు, ఎంఈఓ–2 కేశవరావు, ప్రధానోపాధ్యాయులు ఆదిశేషు, వ్యాయామోపాధ్యాయులు కనకారావు, స్కూల్ చైర్మన్ ఏలియాబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు 40 మంది ఎంపిక

జి.కొండూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో భాగంగా స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలుర అండర్–14, 17 విభాగాల్లో రన్నింగ్, జంపింగ్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావిలిన్ త్రో పోటీలను శనివారం నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చాటిన 40 మంది క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేశారు. హెచ్‌ఎం ఎం. శ్రీలత, పీఈటీ మాధవరావు, పీడీలు మార్తమ్మ, పురుషోత్తం, శ్రీలత, పీఈటీలు టి. మార్త, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఆటల పోటీలు

నూజివీడు: ఎస్‌జీఎఫ్ నూజివీడు నియోజకవర్గ ఆటల పోటీలు శనివారం ముగిశాయి. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, ఖోఖో, యోగా, చదరంగం పోటీలను నిర్వహించారు. ముసునూరు, నూజివీడు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి రవీంద్ర, పీడీలు పాల్గొన్నారు.

చాట్రాయి మండలంలో భారీ వర్షం



చాట్రాయి: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో దాదాపు గంట సేపు వర్షం కురిసింది. గ్రామానికి చెందిన తేనేటి సీతారాములు ఇంటి వద్ద కొబ్బరి చెట్టుపై పిడుగుపడి రెండుగా చీలింది. చనుబండ పాత దళితవాడ కాలనీలో వర్షం నీరు నిలిచింది.

కనసానపల్లిలో స్వచ్ఛతా హీ సేవా

ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యార్థులు కనసానపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు గ్రామంలో చెత్తను, ప్లాస్టిక్‌ను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగ భాస్కర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ మంచి అవకాశాలు

ఆగిరిపల్లి: చదువుకోవాలనే కోరిక ఉన్నవారికి ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని ఎంఈఓ–1 సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ మధ్యలో ఆపేసిన వారికి ఏపీ ఓపెన్ స్కూల్ వరం లాంటిదన్నారు. గ్రామ స్థాయి అధికారులు చదువు మధ్యలో మానివేసిన వారిని గుర్తించాలని చెప్పారు. ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్ కుమార్, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

ఇబ్రహీంపట్నం(మైలవరం): న్యూ ఢిల్లీకి చెందిన ఏపీ కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ, యునైటెడ్ క్రిస్టియన్ చర్చ్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో కొటికలపూడి, కేతనకొండ గ్రామాల్లో సర్పంచ్ నళిని విన్స్టన్‌తో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వరద బాధితులకు నిత్యావసర సరుకులు, సామగ్రి శనివారం పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



కొటికలపూడిలో నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

విద్యార్థిని విరాళం

మైలవరం: స్థానిక వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని షేక్ అమీనాబీ విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.59,241 విరాళం సేకరించి శనివారం పాఠశాల యాజమాన్యానికి అందజేసింది. విద్యార్థిని అమీనాబీని స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి. రాజారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జి.కొండూరు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుందని సీడీపీఓ పుష్పలత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా వెల్లటూరు గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం లభించే ఆహార పదార్థాలతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి అన్నారు. తుమ్మగూడెంలో శనివారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం శేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న సీడీపీఓ పుష్పలత

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడిని కొండపల్లి ఐడీఏ వద్ద లారీ ఢీ కొట్టింది. 30వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మైలవరం వైపు నుంచి కొండపల్లి వైపునకు యువకుడు బైక్‌పై వస్తున్న సమయంలో ఐడీఏ లోపలి నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీకి, అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా ఉండాలి

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా ఉండాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. శనివారం మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 ఎం. సేవియా, ఎంఈఓ–2 జమలయ్య, పలు యూనియన్ల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశా.. సెలవిక



రాఘవాపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణపతి

రెడ్డిగూడెం(మైలవరం)/గంపలగూడెం: వినాయక చవితి సందర్భంగా రాఘవాపురంలో ఏర్పాటు చేసిన గణపతి గత 21 రోజులుగా పూజలందుకున్నారు. శనివారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆశీనుని చేసి మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో నిమజ్జనాలు జరిగాయి.



ఊటుకూరులో వినాయక విగ్రహం ఊరేగింపు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో మంచినీటి పైపులైన్ల నిర్మాణానికి, పెద్దచెరువు గండ్లు పూడ్చివేత పనులను, ఆరో వార్డు, 8వ వార్డుల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో చెరువులకు పడిన గండ్ల పూడ్చివేతకు రూ.4 కోట్లు మంజూరు చేశామన్నారు. నూజివీడు పట్టణం అంతా ఒకే విధమైన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలోని 24 రోడ్లలో 10 రోడ్లలో పైపులైన్ల ఏర్పాటుకు మంజూరు చేశామని, మిగిలిన రోడ్లలో కూడా పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూజివీడు పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 వేల చెక్కును మంత్రి పార్థసారథికి అందించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, కమిషనర్ ఆర్. వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

తూతూ మంత్రంగా ఇది మంచి ప్రభుత్వం

వందరోజుల పాలనపై శనివారం రాత్రి ఆగిరిపల్లి పొన్నం కల్యాణ మండపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం తూతూ మంత్రంగా జరిగింది.

ఆంజనేయులు మాస్టారు కుటుంబానికి పరామర్శ

ముసునూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా పార్టీ కొండంత అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు మాజీ ఎంపీటీసీ మానికల ఆంజనేయులు మాస్టారు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం సాయంత్రం పార్టీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలతో కలిసి మాస్టారు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని ధర్నా

చాట్రాయి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తప్ప పేదలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టడం లేదన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమాన్ని ఇస్తామని మాయమాటలు చెప్పారని, వరదల సమయంలో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. అనంతరం తహసీల్దార్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. సభ్యులు చాట్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు

జీవితాలను చిత్తు చేస్తున్న సైబర్ క్రైమ్

సైబర్ క్రైమ్ సీఐ శ్రీను

మైలవరం: సైబర్ క్రైమ్ జీవితాలను చిత్తు చేస్తున్నాయని సైబర్ క్రైమ్ సీఐ పి. శ్రీను అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ అంశంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. సైబర్ క్రైమ్ సీఐ శ్రీను మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ యాప్‌లకు దూరంగా ఉంటూ జీవితాలను కాపాడుకోవాలన్నారు. యువత ఎక్కువగా ఇంటర్నెట్ సోషల్ మీడియాలో ఫొటోస్ పెట్టడం వలన సైబర్ నేరగాళ్లు వాటిని ఉపయోగించుకొని వివిధ నేరాలు చేయడానికి పాల్పడుతున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాల్లో ప్రజలకు, విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు వలన కలిగే అనర్థాలు వివరించాలని, మొబైల్‌కి బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. ఏసీపీ ఎన్వై ప్రసాదరావు మాట్లాడుతూ యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన చాలా అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగి ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలని చెప్పారు. మైలవరం సీఐ డి. చంద్రశేఖర్, సైబర్ క్రైమ్ ఎస్ఐ మారుతీ, ఎస్ఐ సుధాకరరావు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, డీన్స్ విభాగాధిపతులు, ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్, వివిధ విభాగాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ ప్రసాదరావు, పాల్గొన్న సీఐ

ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలి

తిరువూరు: జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని దక్షిణ భారత హిందీ ప్రచారసభ ప్రచారక్ రేపాక రఘునందన్ అన్నారు. ప్రచారసభ స్థాపించి 106 సంవత్సరాలు అయిన సందర్భంగా శనివారం తిరువూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ద్వితీయ భాషగా హిందీ నేర్చుకోవడంతో పాటు ప్రచారసభ నిర్వహించే పరీక్షలు రాస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. 1918లో స్థాపించిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ నేటికీ భాషాభివృద్ధికి కృషి చేస్తోందని వివరించారు.